పని చేయించుకున్నట్టే క్రమబద్ధీకరించండి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్



అనంతగిరి: జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జేపీఎస్‌లు

తాండూరు రూరల్: అనేక ఆంక్షల నడుమ నాలుగేళ్ల పాటు పంచాయతీ జూనియర్ కార్యదర్శులతో పనులు చేయించుకున్న ప్రభుత్వం అదే విధంగా వారిని క్రమబద్ధీకరించాలి సీపీఎం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. తాండూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ జూనియర్ కార్యదర్శులు చేపట్టిన సమ్మె మంగళవారంతో ఐదు రోజులకు చేరింది. వారి సమ్మెకు సీపీఎం, బీసీ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ కార్యదర్శులు అశోక్, ఫక్రోజీ, బాలకృష్ణ, రవి, కరుణాకర్, వెంకటప్ప, రాములు, యాదగిరి, శివాని, భవాని, అంబిక, జయమ్మ, శిరీష పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

అనంతగిరి: జేపీఎస్, ఓపీఎస్‌లను వెంటనే క్రమబద్ధీకరించాలని జేపీఎస్ యూనియన్ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పరిగి డివిజన్‌కు చెందిన జేపీఎస్‌లు సమ్మె చేపట్టారు. సమ్మెలో భాగంగా మంగళవారం ఆచార్య జయశంకర్ విగ్రహానికి వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం మహిళ జేపీఎస్‌లు బతుకమ్మ ఆడారు. ప్రభుత్వం చొరవ తీసుకుని తమ సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

పెద్దేముల్: సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన ప్రకారం వెంటనే తమను రెగ్యులర్ చేయాలని.. ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం పంచాయతీ జూనియర్ కార్యదర్శులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు.. కార్యదర్శుల విధులను ముగ్గు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేసి సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, మహేశ్, వెంకట చైతన్య, స్నేహలత, వాణి, అర్చన, చంద్రశేఖర్, ఆనంద్, కృష్ణ, సుశీల, సంధ్యారాణి, ఇంద్రజ, అరుణ, మునీరుద్దీన్, హేమలత, గోపాల్, పరమేశ్, ముశ్వంత్, మొగులేశ్, నరేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

జీఓ విడుదల చేయాలి

యాలాల: పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం వెంటనే జీఓ విడుదల చేయాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పంచాయతీ జూనియర్ కార్యదర్శులు చేపడుతున్న సమ్మెకు ఆయన మంగళవారం సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమ్మెకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. కార్యదర్శుల సమస్యలను బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి షుకూర్, సంఘం యాలాల, బషీరాబాద్ మండలాల అధ్యక్షులు లక్ష్మణాచారి, నరేందర్, కార్యదర్శులు తారకాచారి, ఉదయ్, వెంకట్‌రెడ్డి, సునీల్ కుమార్, సుధాకర్, శ్రీనివాస్, పావని, దీప, లలిత, అఫ్రోజ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించే వరకు సమ్మె

బంట్వారం: ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని బంట్వారం, కోట్‌పల్లి మండలాల పంచాయతీ జూనియర్ కార్యదర్శులు అన్నారు. జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. 22 మంది జేపీఎస్‌లు వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్‌లు పరిష్కరించాలని కోరారు.



తాండూరు రూరల్: సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు



యాలాల: సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్న రాజ్‌కుమార్



పెద్దేముల్: విధులను ముగ్గుల రూపంలో వేసిన జేపీఎస్‌లు

విద్యతోనే సమాజాభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



జగదీశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కొడంగల్ రూరల్: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సొంత ఖర్చుతో నిర్మించిన పార్కింగ్ షెడ్‌ను ప్రాంభించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రాజారాం, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంగ్లిష్ భాషాదినోత్సవం, ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు, మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్లలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

బంట్వారం: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండడంతో పంచాయతీ సీనియర్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని రాంపల్లి, సల్బత్తాపూర్, నాగవరం గ్రామాల కు విజయ్‌కుమార్ (ఎంపీఓ), బంట్వారం, మద్వాపూర్ సుశీల్‌కుమార్ షిండే (సూపరింటిండెంట్)ను నియమించారు. మాలసోమారం, సుల్తాన్‌పూర్, యాచారం గ్రామాలకు తొర్మామిడి జేపీ షఫీయొద్దీన్, బస్వాపూర్, బొప్పునారం పంచాయతీల్లో స్వప్న విధుల్లో చేరారు.

బహుజనులు ఏకమైతేనే రాజ్యాధికారం

బీఎస్పీ మండల అధ్యక్షుడు సయ్యద్ బాబా



దోమ: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నేతలు

బంట్వారం: బహుజనులమంతా ఏకమైతేనే రాజ్యాధికారం సాధ్యమని బీఎస్పీ మండల అధ్యక్షుడు సయ్యద్ బాబా అన్నారు. మంగళవారం ఆయన బంట్వారం, యాచారం, సుల్తాన్‌పూర్, నూరుల్లాపూర్ గ్రామాల్లో పర్యటించి తెలంగాణ భరోసా సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్‌బాబా మాట్లాడుతూ.. పేదల బతుకులు మారాలంటే బహుజనులు పాలించాలన్నారు. ఈ నెల 7న నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే తెలంగాణ భరోసా సభకు యూపీ మాజీ సీఎం మాయవతి హాజరవుతారని చెప్పారు. బహుజనులు పెద్ద ఎత్తున తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే సమన్యాయం

దోమ: బీఎస్పీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేకూరుతుందని పార్టీ మండల అధ్యక్షుడు గార్లపల్లి మల్లయ్య అన్నారు. మంగళవారం ఆయన ఈ నెల 7న నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణయ్య, సాయికుమార్, జ్యోతి, వెంకటేశ్, శ్రీనివాస్, శివకుమార్, బాలకృష్ణ, పాండు, బాబు, నర్సింలు, గణేశ్, బాబు, రవి, అశోక్, స్వామి, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

‘తెలంగాణ భరోసా’ను విజయవంతం చేయండి

కొడంగల్: తెలంగాణ భరోసా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద అన్నారు. మంగళవారం ఆమె మే 7న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభను విజయవంతం చేసేందుకు భారీ సమీకరణకు కృషి చేస్తున్నామన్నారు.

పేదలకు ఆసరాగా సంక్షేమ పథకాలు

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: పేదింటి ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆసరాగా నిలుస్తున్నాయని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వరాష్ట్ర పాలనలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అర్హులంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 110 మంది లబ్ధిదారులకు రూ.1.10కోట్ల విలువైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, సర్పంచ్‌లు నవ్య, వినోద్‌గౌడ్, శ్రీధర్‌గుప్తా, డీటీ మోహన్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గ్రామాలకు ఇన్‌చార్జి అధికారులు

పెద్దేముల్: ఐదు రోజులుగా పంచాయతీ జూనియర్ కార్యదర్శులు సమ్మె చేస్తుండడంతో జిల్లా అధికారులు గ్రామాల వారిగా ఇన్‌చార్జి అధికారులను నియమించారు.

గ్రామాలు	అధికారి
రెగోండి, మంబాపూర్, హన్మాపూర్	ఎంపీఓ షేక్ సుస్మా
రుద్రారం, నాగులపల్లి, తట్టెపల్లి	పెద్దేముల్ కార్యదర్శి భాస్కర్
ఖాజాపూర్, గాజీపూర్, మధనంతపూర్, రుక్మాపూర్	కందనెల్లి కార్యదర్శి రమేష్‌కుమార్
మారేపల్లి, బండపల్లి, గిర్మాపూర్, దుగ్గాపూర్	జనగాం కార్యదర్శి మల్లికార్జున్
అడ్కిచెర్ల, బాయిమీదితండా, మారేపల్లి తండా, మన్‌సాన్‌పల్లి	ఉరేంటితండా కార్యదర్శి కిషన్
ఓంలానాయక్ తండా, సిద్దన్న మడుగుతండా, ఎర్రగోడ తండా	జైరాంతండా కార్యదర్శి రజిత
బండమీదిపల్లి, జైరాంతండాకు	పాషపూర్ కార్యదర్శి రవి ప్రసాద్
బుద్దారం, గోట్లపల్లి	జూనియర్ అసిస్టెంట్ వెన్నెల
కందనెల్లితండా, ఆత్కూర్	ప్రమోద్‌కుమార్
కొండాపూర్, ఇందూరు	మొగులయ్య

మమత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శుభప్రద్ పటేల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

పెద్దేముల్: ఒకే కాన్పులో ముగ్గురు మగ బిడ్డలను జన్మనిచ్చిన తల్లిదండ్రులకు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అండగా నిలిచారు. పేదింటికి చెందిన మమత ఆస్పత్రి ఖర్చులకు, పిల్లల పోషణకు ఇబ్బందిగా ఉందని దాతలు ఆదుకోవాలని మంగళవారం దినపత్రికల్లో వచ్చిన కథనానికి శుభప్రద్ పటేల్ స్పందించి వారి ట్రస్టు నుంచి ఆర్థికసాయం అందజేశారు. మమత తల్లిగారి గ్రామం ఉదండాపూర్‌కు చేరుకుని ఆర్థికసాయం అందజేశారు. ముమ్ముందు ఎటువంటి సహాయం అవసరమైన అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కౌసల్య, ఉప సర్పంచ్ షబానా కలీల్, శుభప్రద్ పటేల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాలు, భానుప్రసాద్, శ్రీశైలం, చందు, విజయ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి పరిష్కారానికి చర్యలు

జెడ్పీటీసీ సభ్యురాలు అరుణదేశు చౌహాన్



బోరు పనులను ప్రారంభిస్తున్న అరుణదేశు చౌహాన్

బొంరాస్‌పేట: నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీటీసీ సభ్యురాలు అరుణదేశు చౌహాన్ అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని టేకులగడ్డ తండాలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు వేయించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ.. రూ.2లక్షల జెడ్పీ నిధులతో ఈ పనులు చేపట్టామన్నారు. ఆమె వెంట ఎంపీపీ హేమీబాయి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీబాయి, సర్పంచ్ శంకర్‌నాయక్, దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’పై అవగాహన కల్పించండి

ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మర్పల్లి: కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని బూచన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి పరీక్షలకు వచ్చే వారికి సరైన వసతులు కల్పించాలని సర్పంచ్ జయాదయాకర్, వైద్య సిబ్బందికి సూచించారు. కంటి లోపాలు గుర్తాఇంచి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణ్‌కుమార్, వైద్య సిబ్బంది, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఉన్నారు. కంటి వెలుగు కేంద్రం గ్రామంలో కొనసాగుతున్నట్లు తమకు సమాచారం ఇవ్వలేదని ఎంపీడీఓకు ఎంపీటీసీ బాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.

ఈ నెలాఖరుకు పనులు పూర్తి

మన ఊరు- మన బడి పనులు పరిశీలించిన ఎంపీడీఓ



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ పాండునాయక్, నారాయణరెడ్డి

బొంరాస్‌పేట: మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను మే నెలాఖరుకు అన్ని పాఠశాలల్లో పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరానికి సిద్ధం చేయాలని ఎంపీడీఓ పాండునాయక్ అన్నారు. మండల పరిధిలోని ఏర్పుమళ్ల, చౌదర్‌పల్లి గ్రామాల్లోని పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. ఏర్పుమళ్లలో మంజూరైన పాఠశాల అదనపు గదుల నిర్మాణం తదితర పనులు ప్రారంభించలేదని వెంటనే పనులు చేపట్టాలని ఎంపీడీఓ సూచించారు. అనంతరం చౌదర్‌పల్లిలో పనులు పరిశీలించిన ఆయన రూ.8లక్షల నిధులతో మన ఊరు మనబడి కార్యక్రమంతోపాటు, రూ.4లక్షల నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీ, విద్యుత్ తదితర పనులు పూర్తయి సిద్ధంగా ఉన్నాయని ఎంపీటీసీ సభ్యుడు శేరినారాయణరెడ్డి, సర్పంచ్ వెంకటమ్మ తెలిపారు. ఎంపీడీఓ వెంట ఏఈలు మహేశ్, ఆంజనేయులు ఉన్నారు.

ఆడపిల్లల వివాహానికి సాయం



వంటసామగ్రి అందజేస్తున్న సర్పంచ్ శివిబాయి

కుల్కచర్ల: గ్రామంలోని ఆడపిల్లల వివాహానికి అల్లాపూర్ సర్పంచ్ శివిబాలునాయక్ నిర్విరామంగా సాయం అందజేస్తున్నారు. మంగళవారం అల్లాపూర్ పంచాయతీకి చెందిన కోస్గి మొగులయ్య, లక్ష్మి దంపతుల కుమార్తె మహేశ్వరి వివాహానికి రూ.10వేల విలువైన వంటసామగ్రిని ఆమె కానుకగా అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మల్లమ్మ, రాములు, అనిల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంచేందుకు వేసవి శిబిరాలు

ఎంఈఓ హరిశ్చందర్



దోమ: స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలతో విద్యార్థులు



యాలాల: జక్కేపల్లిలో వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ

దోమ: సెలవుల్లో విద్యార్థులు చదువుకు దూరంగా ఉండకుండా ఉండేందుకు వేసవి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల విద్యాధికారి హరిశ్చందర్ చెప్పారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కిష్టాపూర్, పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల నైపుణ్యాలు పెంచేందుకు ఈ క్యాంపులు దోహదపడతాయన్నారు. ప్రతీ విద్యార్థిని శిబిరానికి పంపించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. దోమ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పురందాస్, పోతిరెడ్డిపల్లి సర్పంచ్ లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి: ఎంఈఓ

యాలాల: ప్రతీ విద్యార్థి సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జక్కేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరాల్లో విద్యార్థులు జ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. శిబిరాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చిన హెచ్ఎం లీలావతి, అంగన్‌వాడీ, స్థానిక యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణమ్మ, గణేశ్, మల్లేశం, రాములు, ఎస్ఎంసీ చైర్మన్ బీరమ్మ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి తిరుమలనాథుడి జాతర

పూడూరు: మండల పరిధిలోని రాకంచర్ల యోగానంద లక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభిచనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న ఉదయం అఖండ దీపారాధన, ధ్వజారోహణం, నృసింహజయంతి, 5న సాయంత్రం స్వామి వారి కల్యాణం, రాత్రి 10గంటలకు రథోత్సవం, 6న రాత్రి దోపోత్సవం, 7న ఆదివారం సహస్ర పుష్పార్చన, 8న చక్రతీర్థం కార్యక్రమాలుంటాయని వివరించారు. కల్యాణం చేయించే భక్తులు ఆలయంలో ముందుగానే సంప్రదించాలని సూచించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే ఆనంద్



జాతరకు హాజరైన ఎమ్మెల్యే

అనంతగిరి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం ఆయన వికారాబాద్ మండలం మదన్‌పల్లి సమీపంలోని సంగమేశ్వర స్వామి జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, వైస్ ఎంపీపీ రాములు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 25మందికి కంటి సమస్యలున్నట్లు గుర్తించి వారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందుకూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను పేదలను సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు మురహరి వశిష్ఠ, దాసప్ప యాదవ్, శివరాజ్ పాటిల్, సరాఫ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మధుయాదవ్

కొడంగల్: పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంలా మారిందని మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్ అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సహకారంతో బాధితులకు మంజూరైన రూ.70వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. అర్హులందరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.

వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

పరిగి: వార్డు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కౌన్సిలర్ అర్చన అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి మున్సిపల్ కేంద్రంలోని 2వ వార్డులో డ్రైనేజీ సమస్యలు తలెత్తడంతో మంగళవారం జేసీబీ సాయంతో చెత్త తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డులో సమస్యలుంటే తన దృష్టికి తీసకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి వర్షాల కారణంగా డ్రైనేజీ సమస్యలు తలెత్తాయని త్వరలోనే వాటిని శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

కుల్కచర్ల: కాలనుగుణంగా సమాజంలో చోటు చేసుకుంటున్న పరిస్థితులపై బాలికలు అవగాహన పెంపొందించుకోవడం అవసరమని చాపలగూడెం సర్పంచ్ లక్ష్మణ్, చైల్డ్ లైన్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చాపలగూడెం పంచాయతీ పరిధిలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలు చదువుపై దృష్టి సారిస్తూనే సామాజిక అంశాలపై అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తినా, బాల్యవివాహాలు చేసేందుకు యత్నించినా డయల్ 100 లేదా 1098లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వీరమణి పాల్గొన్నారు.